ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు 52 ప్రత్యేక బస్సు సర్వీసులు

నూజివీడు టౌన్ : నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు 52 బస్సు సర్వీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్ పసుమర్తి ధనాంజనేయులు తెలిపారు. డిపోలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్రంలో దసరా సెలవుల నేపథ్యంలో వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు చెప్పారు. ప్రయాణికుల కోసం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అనంతపురం రెండు, కడప రెండు, కర్నూల్ రెండు, శ్రీకాకుళం పది, విశాఖపట్నం 11, విజయనగరం ఆరు, నెల్లూరు రెండు, తిరుపతి మూడు, తుని రెండు, ఒంగోలు ఆరు, కాకినాడ రెండు, అమలాపురం రెండు, రాజమండ్రి రెండు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు, యాత్రికుల కోరిక మేరకు వారి అవసరార్థం ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. మిగిలిన వివరాలకు కార్యాలయ పని వేళల్లో నూజివీడు డిపోలో సంప్రదించవచ్చని సూచించారు.

సమానత్వం కోసం పోరాడాలి

సమాజంలో రాజ్యమేలుతున్న అసమానతలు
ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి
ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థినుల రాష్ట్రస్థాయి కన్వెన్షన్ ఘనంగా ప్రారంభం

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో స్త్రీ, పురుష బేధాలు నేటికీ కొనసాగుతుండటం అత్యంత బాధాకరమని, ఈ నేపథ్యంలో సమానత్వం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. సమాజంలో అసమానతలు రాజ్యమేలుతున్నాయని, రాజ్యాంగంలోని సమాన హక్కుల సాధనకు అంతా నడుం బిగించాలని కోరారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి విద్యార్థినుల కన్వెన్షన్ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కన్వెన్షన్ ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లవి ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేగువేరా, సీతారాం ఏచూరి, భగత్ సింగ్, మల్లు స్వరాజ్యం, సావిత్రిభాయి పూలే, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, షేక్ సాబ్జీ చిత్రపటాలకు నేతలు విద్యార్థినులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ పావని అధ్యక్షతన జరిగిన కన్వెన్షన్‌లో జ్యోతి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మృతులకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రమాదేవి ప్రారంభోపన్యాసం చేశారు. సమాజంలో కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ, పేద, ధనిక బేధాలు కొనసాగుతున్నాయన్నారు. నేటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శారదా పీఠం నిర్వహిస్తూ, ఐఐటి కళాశాల డైరెక్టర్‌గా పని చేస్తున్న స్వామి చైతన్యానంద మహిళ అధ్యాపకులను, విద్యార్థినులను వేధించడం, ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన రెజ్లర్స్ పట్ల బిజెపి ఎంపీ అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి అనేకం జరుగుతున్నాయన్నారు. ధర్మస్థలం అనే ప్రాంతంలో 400 మంది మహిళలు, విద్యార్థినులు ఏమయ్యారో తెలియదని, పేరుకే అది ధర్మస్థలమని, అయితే అది అధర్మ స్థలమని విమర్శించారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించట్లేదని విమర్శించారు. ఎస్‌సి హాస్టళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. యూనివర్సిటీల్లో సైతం పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందట్లేదని, కనీస సౌకర్యాలూ ఉండట్లేదని తెలిపారు. 8 గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేశారని, ఇక మహిళలు ఏవిధంగా బతుకుతారో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతలు మహిళలను కించపరిచే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. 32 మంది బలిదానంతో ఏర్పాటు చేసుకున్న నాలుగు లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నం చేస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ వాళ్లతో జత కలవడం దారుణమన్నారు. చదువు ఎంత ముఖ్యమో, ఉద్యోగం, ఉపాధి కూడా అంతే ముఖ్యమని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో గౌరవం పొందాలంటే పోరాడి సమాన హక్కులను సాధించుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేరళలోని త్రివేండ్రంలో 1979లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని, ఇప్పటికి 55 ఏళ్ల పూర్తవుతుందని అన్నారు. అసమానతలకు వ్యతిరేకంగా సమానత్వం కోసం నాటి నుంచి పోరాడుతూనే ఉన్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులపై నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. పసి పిల్లల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకూ అందరిపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళా రెజ్లర్ల పట్ల బిజెపి ఎంపీ అసభ్యకరంగా ప్రవర్తిస్తే సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినప్పటికీ శిక్ష విధించలేదని విమర్శించారు. గుజరాత్‌లో మారణ హోమం కారకులను జైలు నుంచి విడిపించి, వారిని సత్కరించడం దారుణమన్నారు. అసమానతలు పెంచి పోషిస్తుంది పాలకపక్షాలేనని ఆరోపించారు. సమానత్వం కోసం పోరాడడమే కాకుండా వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు తీరని ద్రోహం చేసిందన్నారు. దీనిలో ముఖ్యంగా నష్టపోయింది విద్యార్థినులేనన్నారు. చరిత్ర పాఠ్యాంశాలను తొలగించి మతోన్మాదంతో కూడిన మనుధర్మాన్ని పాఠ్య పుస్తకాల్లోకి తీసుకురావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కో కన్వీనర్ లలిత, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థినులు

సమానత్వంతో కూడిన విద్య అందించాలి
ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

మాట్లాడుతున్న ఐషీ ఘోష్

ప్రభుత్వం అందరికీ సమానత్వంతో కూడిన విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. విద్యా సంస్థల ప్రయివేటీకరణ వల్ల వల్ల విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. నూతన విద్యా విధానం ఫలితంగా లక్షలాది మంది విద్యార్థినులు విద్య కు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు, వివక్ష, అత్యాచారాలకు వ్యతిరేకంగా విద్యార్థినులు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది విద్యార్థినులపై హత్యలు, లైంగిక దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తాను పెట్టబోయే మొదటి సంతకం సుగాలి ప్రీతి కేసుపై అని బహిరంగ సభలో చెప్పారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా సుగాలి ప్రీతి కేసు పట్టించుకోలేదని విమర్శించారు. ఆలిండియా కమిటీ సభ్యురాలు పల్లవి, నేతలు పి.పవిత్ర, జ్యోతి, అమూల్య, నవిత, వివిధ జిల్లాల నుంచి విద్యార్థినుల కమిటీ నేతలు పాల్గొన్నారు.

నేవీ ఆయుధ డిపో వద్దేవద్దు

గ్రామాల్లో గిరిజనుల ప్రదర్శనలు
ఎంపీ, ఎంఎల్ఎ, అధికార పార్టీ నేతల దిష్టిబొమ్మలు దహనం

ఆయుధ డిపో మాకొద్దు అంటూ ప్రదర్శన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపోను ఏర్పాటు చేయడం వల్ల గిరిజన ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో గురువారం జరిగిన బిజెపి సమావేశంలో ఏలూరు ఎంపీ, పోలవరం ఎంఎల్ఎ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. తమ గ్రామాల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయొద్దని అంటుంటే బయట వ్యక్తులు ఇలా వ్యతిరేక ప్రకటనలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో గిరిజనులు ఆయుధ డిపో వద్దేవద్దు అంటూ ఆయా గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఎంపీ, ఎంఎల్ఎలతోపాటు బిజెపి నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు కుదరదని గత మూడేళ్లలో మూడుసార్లు గ్రామ సభల్లో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా సరే ఇటీవల ఎంపీ, ఎంఎల్ఎ దుందుడుకుగా ఈ ప్రాంతంలోనే నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. గతంలో పలు ప్రాజెక్టుల పేరుతో గిరిజనులను నిలువునా ముంచారన్నారు. నిర్వాసితులకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు ఏం న్యాయం జరిగిందని, ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో, ఉపాధి చూపారో చెప్పాలని ప్రశ్నించారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారం నాగ దుర్గ, పొట్ట వెంకటేశ్వరరావు, మడకం శేషగిరిరావు, సున్నం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దిష్టి బొమ్మల దహనం

కౌలు రైతులకు రుణాలివ్వాలి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక అమలులో ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన లక్ష్యాల మేర రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 70 వేల మంది కౌలు రైతులకు రుణార్హత కార్డులు అందించామన్నారు. 20,500 మంది కౌలు రైతులకు రూ.375 కోట్లు రుణాల లక్ష్యానికిగాను ఇంతవరకు కేవలం 5772 మంది కౌలు రైతులకు రూ.31.69 కోట్లు మాత్రమే రుణాలు అందించడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో మండలస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాలు నిర్వహించి అర్హులైన ప్రతి రైతుకు, కౌలు రైతుకు రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13,845 కోట్లు లక్ష్యమవ్వగా, ఇంతవరకు 31.31 శాతం మేర రూ.5712 కోట్లు రుణాలుగా అందించారని, వ్యవసాయ ప్రధానమైన జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రుణాల మంజూరు మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని 14,445 స్వయం సహాయక సంఘాలకు రూ.1180 కోట్లు రుణాలు లక్ష్యమవ్వగా ఇంతవరకు 6489 స్వయం సహాయక సంఘాలకు రూ.357.88 కోట్లు రుణాలు మంజూరు చేశారని, వీటిని కూడా లక్ష్యాల మేరకు మంజూరు చేయాలని అన్నారు. పిఎం సూర్యఘర్ యోజన ముఫ్తి బిజిలి యోజనలో దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎంఎస్ఎంఇలో జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వంద యూనిట్ల లక్ష్యానికిగాను, 41 యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు బ్యాంకర్లకు అందించగా 16 దరఖాస్తులు మంజూరు చేశారని, 22 దరఖాస్తులు బ్యాంకర్ల పరిశీలనలో ఉన్నాయని, నిబంధనల మేరకు లేని మూడు దరఖాస్తులు బ్యాంకర్లు తిరస్కరించారని అన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు, ఆర్‌బిఐ ఎల్‌డిఒ గిరిధర్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, నాబార్డు డిడిఎం పి.అనిల్‌కాంత్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పశుసంవర్ధక శాఖ జెడి బి.ప్రసాదరావు, మైక్రో ఇరిగేషన్ శాఖాధికారి ఎస్.రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.హబీబ్ భాషా, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి: కలెక్టర్

స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఎపిసిఎన్ఎఫ్) ప్రకృతి వ్యవసాయంపై జాతీయ లక్ష్యం జిల్లాస్థాయి కన్వర్జెన్స్ సమావేశం, సంబంధిత అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో 2022-23లో 47,639 మంది రైతులు 50,487 ఎకరాల్లో, 2023-24లో 53,664 మంది రైతులు 59,784 ఎకరాల్లో, 2024-25లో 54,696 మంది రైతులు 54,817 ఎకరాల్లో, 2025-26లో 59,325 మంది రైతులు 58,112 ఎకరాల్లో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని జిల్లా ప్రాజెక్టు మేనేజరు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ 2024-25లో సాగు తగ్గడంపై అసహనం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింత విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగు పెరిగేలా లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపడతానని, అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. కషాయాలు వాడుతూ పురుగుల మందుల వాడకం తగ్గించడం శుభ పరిణామని అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా, జిల్లా ఉద్యాన శాఖాధికారి కె.సంతోష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఎంఐఒ ఎస్.రామ్మోహన్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.ప్రసాదరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజరు బి.వెంకటేష్, డాట్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్, రైతులు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరికి కొనసాగుతున్న వరద

భద్రాచలంలో 44 అడుగులకు చేరిన నీటిమట్టం
27 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదావరికి వరద ఉధృతి శుక్రవారం కూడా కొనసాగింది. భద్రాచలంలో గురువారం 37 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం శుక్రవారం నాటికి అనూహ్యంగా పెరిగి 43 అడుగులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే రెండు రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వేపైకి వరద నీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, రోగులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో 12 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి వరద అంతకంతకూ పెరుగుతుండటంతో మండలంలోని మిర్చి రైతులు సాగు పనులు నిలిపివేశారు. ప్రత్యామ్నాయ పంటల దిశగా ఆలోచన చేస్తున్నారు. గోదావరి వరద మరో రెండు అడుగులు పెరిగితే ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపైకి నీరు చేరి మరో మూడు గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తాయి. గోదావరి వరద పెరుగుతుండటంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద పెరుగుతుండటంతో పల్లపు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. గురువారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి 44 అడుగులు దాటి ప్రవహిస్తుండటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మళ్లీ గోదావరి పెరుగుతుండటంతో కోయిదా వెళ్లే మార్గంలోని ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దువాగు కాజ్‌వే మునిగిపోవడంతో కొయిదా, కాచారం, సిద్ధారం, టేకుపల్లి, టేకూరు తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచి జన జీవనం స్తంభించింది. గోదావరి ఉధృతికి వేలేరుపాడు నుంచి రుద్రంకోట వెళ్లే రహదారి కూడా నీట మునిగే పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం వారపు సంత కావడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు దారి సౌకర్యం లేక నానావస్థలు పడుతున్నారు.

పోలవరం వద్ద గోదావరి వరద

పోలవరం నుండి 7,62,862 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: ఎగువ రాష్ట్రాలు, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి మరింత పెరిగింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 7,62,862 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.530 మీటర్లు, స్పిల్‌వే దిగువన 22.650 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 32.050 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 22.200 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.080 మీటర్లు నమోదైనట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 10.83 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

భూ సేకరణ నిలుపుదల చేయాలి

తహశీల్దార్‌కు ఆదివాసీ ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో భూ సేకరణ నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆదివాసీ ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ తరపున తహశీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో ఇప్పటికే వివాదాల్లో ఉన్న వేల ఎకరాల భూములను సేకరించి పోలవరం నిర్వాసితులకు కేటాయించటంతో భూవివాదాలతో స్థానిక ఆదివాసీలు, నిర్వాసిత ఆదివాసీలు నిరంతరం గొడవలు పడుతున్నారన్నారు. వనరులు లేక, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లోకి ఏడు మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను తీసుకొచ్చి పునరావాసం కల్పించడం సరికాదన్నారు. పెద్ద మొత్తంలో ప్రభుత్వ సొమ్మును దోచుకోవడానికి ఎల్‌టిఆర్ భూములను సేకరించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, దళారులు తాపత్రయ పడుతున్నారన్నారు. ఏలూరు జిల్లా ఎఎస్ఆర్ జిల్లా రంపచోడవరం డివిజన్ షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న కొయ్యలగూడెం, గోపాలపురం, చింతలపూడి, నల్లజర్ల, గోకవరం తదితర మైదాన ప్రాంత మండలాల్లో ఉన్న అడవులను సేకరించి పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఆ ప్రాంతాన్ని షెడ్యూల్ ప్రాంతంగా నోటిఫై చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పోలవరం కాలువ ఆయకట్టు భూములను సేకరించి భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి తెల్లం గంగరాజు, జిల్లా కార్యదర్శి కోర్స నాగేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజా కృష్ణంరాజు, డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు, బుట్టాయగూడెం మండలాధ్యక్షులు రవ్వ బసవరాజు, ప్రధాన కార్యదర్శి పోడియం కొవ్వాడయ్య, నాయకులు పూసం శ్రీను, కారం వెంకటేశ్వరరావు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్లం శ్రీనివాసరావు, ఆదివాసీ నాయకులు కంగాల శ్రీనివాసరావు, మడకం దుర్గారావు, చోడెం దుర్గారావు మడకం రమేష్, కొమరం రాము, బుద్ధులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

246 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
ఇప్పటికే వారిపై పలు కేసులు
కేసు ఛేదించినవారికి ఎస్‌పి ప్రత్యేక అభినందన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటి తలుపులు పగులగొట్టి లోపల నిద్రిస్తోన్న భార్యాభర్తలను కొట్టి బీరువాలోని సుమారు 40 కాసుల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండిని దుండగులు అపహరించుకుపోయారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం గ్రామంలో చోటు చేసుకుంది. ఈ డెకాయిటీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ వెల్లడించారు. లక్కపరం గ్రామం రామాలయం వీధిలో లక్ష్మీకుమారి, తన భర్త నివాసం ఉంటున్నారు. ఈ నెల 23వ తేదీ తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు గది తలుపులు పగులగొట్టి బెడ్ రూములో నిద్రిస్తున్న వారి నోరు మూసివేసి కర్రలతో కొట్టి బీరువాలోని సుమారు 40 కాసుల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌పి ఆదేశాలతో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెం సిఐ సుభాష్, చింతలపూడి సిఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు ప్రారంభించాయి. పోలీసుల దర్యాప్తులో పాత నిందితుడి నిర్వాకం వెలుగులోకి వచ్చింది. లక్కవరం గ్రామానికి చెందిన దేవర శ్రీరామ్మూర్తిపై కేడీ షీట్ ఉంది. శ్రీరామ్మూర్తి పాత నేరస్తుడు కాగా వయస్సు రీత్యా తాను చోరీలకు పాల్పడకుండా తనకు తెలిసిన నేరగాళ్లతో చోరీలు చేయిస్తున్నాడు. బాపట్ల జిల్లా స్టువర్టుపురానికి చెందినవారితో చోరీలు చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితురాలు లక్ష్మీకుమారి ఇంటిపక్కనే నివాసం ఉంటున్న బాజీ అనే వ్యక్తి ఆమె ఇంట్లో డబ్బు, బంగారం భారీగా ఉందని శ్రీరామ్మూర్తికి సమాచారం ఇచ్చాడు. స్టువర్టుపురం నుంచి ముగ్గురు దొంగలను పిలిపించి బాజీ ఇల్లు చూపించగా చోరీ చేశారు. శ్రీరామ్మూర్తి బాపట్ల జిల్లా స్టువర్టుపురం నుంచి అంగడి విల్సన్‌బాబు, గజ్జెల వాసు, కావేటి ప్రసాద్ (రమేష్) అనే ముగ్గురు దొంగలను లక్కవరం గ్రామానికి పిలిపించి డెకాయిట్ నేరానికి పాల్పడ్డారు. ఈ కేసులో రామ్మూర్తితో పాటు స్టువర్టుపురం నుంచి వచ్చిన ముగ్గురిలో ఇద్దరిని, వారికి సహకరించిన బాజీని మొత్తం నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కావేటి ప్రసాద్ పరారీలో ఉన్నాడు. శ్రీరామ్మూర్తిపై 14 కేసులు, విల్సన్‌బాబుపై ఆరు కేసులు, వాసుపై ఏడు కేసులు ఉన్నాయి. పరారీలో ఉన్న ప్రసాద్‌పై 12 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి 246 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇనుపరాడ్డు, రెండు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. ఈ డెకాయిటీ కేసును ఛేదించటంలో ప్రతిభ చూపిన వారికి ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

రాష్ట్రంలోనే ఏలూరు డిసిఎంఎస్ ప్రథమస్థానం

ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలోనే ఏలూరు డిసిఎంఎస్ ప్రథమ స్థానంలో ఉందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. ది పశ్చిమగోదావరి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సమావేశం ఏలూరులోని డిసిఎంఎస్ ప్రధాన కార్యాలయం ఆవరణలోని గ్రాండ్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సొసైటీ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమితులైనవారందరినీ అభినందించారు. ఛైర్మన్‌గా నియామకమైన ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటే వారికి సహకారం అందించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో ఏలూరు డిసిఎంఎస్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. భారతదేశంలో ఉన్న 29 రాష్ట్రాల్లో డిసిఎంఎస్‌లలో కంప్యూటరీకరణ చేసిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లల్లో రైతులకు లోన్లు ఇవ్వడం గాని, రికవరీ గాని చేయలేదని, సొసైటీ బ్యాంకు వ్యవస్థను నిర్వీర్యం చేశారని చెప్పారు. నూతనంగా నియామకమైన ఛైర్మన్‌లందరూ కలిసికట్టుగా పనిచేసి సొసైటీలను అభివృద్ధి బాటలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుకు సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లు పుష్పగుచ్ఛాలను అందించి దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. నూతన సొసైటీ ఛైర్మన్‌లను ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ ఘనంగా సన్మానించారు.

గన్నిని సత్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్లు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం 1997-1998, 1998-1999, 1999-2000 సంవత్సరాల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆనాటి జ్ఞాపకా లను, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యా ర్థులు ప్రతి ఏడాది పేద విద్యార్థులకు అవ సరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తూ ఉంటారు. ఈ మూడు బ్యా చుల పూర్వ విద్యార్థుల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి ప్రత్య క్షంగా, పరోక్షంగా ఎంతోమందికి సాయం చేస్తున్నారు. చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయడానికి తాము ఎప్పుడూ ముందుంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లను బహూకరించారు.

పూర్వ విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతో అంటువ్యాధులు దూరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అపరిశుభ్ర పరిసరాలు అంటువ్యాధులకు ఆవాసాలని, పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రతని ఏలూరు మోతేవారితోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక ఏలూరు మోతేవారితోట ఐదో రోడ్డులో శుక్రవారం ప్రజలకు డ్రై డే పరిసరాల పరిశుభ్రత ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. వర్షాలు అధికంగా పడడం వల్ల కీటకాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యంగా దోమలు, ఈగల ద్వారా ప్రాణాంతక వ్యాధులు డెంగీ, మలేరియా, అతిసారా, కామెర్లు, టైఫాయిడ్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా దోమలు పెరగకుండా ఇంటి పరుషాలు పల్లప్రాంతాలు మట్టితో పూడ్చుకోవాలని, మనం వాడే తొట్టెలు, డ్రమ్ములు ,ఓవర్ ట్యాంకులు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టుకోవచ్చుని, మురికి కాలువలో చెత్త వేయరాదని సూచించారు. ఈగల అభివృద్ధి ఇంటి పరిసరాల్లో చెత్త పోగులు, పేడ పోగులు పెట్టరాదని ప్రతి శుక్రవారం డ్రై డే ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సొసైటీ ఛైర్మన్ సాయివినయ్

సహకార సంఘం అభివృద్ధికి కృషి

మల్లుకుంట సొసైటీ ఛైర్మన్ శీలం సాయివినయ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

సహకార సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మల్లుకుంట ఛైర్మన్ శీలం సాయివినయ్ తెలిపారు. స్థానిక సొసైటీ ఆవరణలో శుక్రవారం చైర్‌పర్సన్ సాయి వినయ్ అధ్యక్షతన సొసైటీ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం మండలంలోని బొర్రంపాలెంలో ఎరువులు, వ్యాపారం, మినరల్ వాటర్ ప్లాంట్ పున:ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కమర్షియల్ బ్యాంకుల తరహాలో సొసైటీ ద్వారా బంగారంపై రుణాలు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బొర్రంపాలెంలో సొసైటీ పెట్రోల్ బంకు ద్వారా వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టినట్లు చెప్పారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్లు తలారి ఆంధ్రబాబు, వెదుళ్ల వెంకటేశ్వరరావు, సిఇఒ కెవివి.సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం ఈ నెల 27వ తేదీ శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న చింతలపూడి ఫీడర్‌లోని పాతచింతలపూడి ఏరియాలో, శంఖుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సత్యసాయి ఫీడర్, 11 కెవి తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్లకు శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

'జగన్‌ను సైకో అనడం సరికాదు'

ప్రజాశక్తి - ఉంగుటూరు

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి టిడిపి ఎంఎల్ఎ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైసిపి మండల కమిటీ నాయకులు అన్నారు. వైసిపి మండలాధ్యక్షులు మరడ మంగారావు ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తలు, ఎంపిటిసి, జెడ్‌పిటిసిల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో జగన్మోహన్‌రెడ్డిని సైకోగా అభివర్ణించిన సదరు ఎంఎల్ఎ తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా వైసిపి శ్రేణులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. క్షమాపణ చెప్పాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమావేశంలో ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఆ పార్టీ స్టేట్ బూత్ కమిటీ సెక్రటరీ పాపారావు బాబ్జి, స్టేట్ మహిళా ప్రధాన కార్యదర్శి మంద జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పెనుగొండ బాలకృష్ణ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ, మైనార్టీ విభాగం కార్యదర్శి సయ్యద్ బాజీ, ఎంపిటిసి మండల ఛాంబర్ అధ్యక్షులు బండారు నాగరాజు, సర్పంచి ఛాంబర్ అధ్యక్షులు విష్ణుమూర్తి, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతంపేట సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన మెట్లపల్లి కిరణ్‌కుమార్(31) స్థానికంగా మినరల్ వాటర్ తయారు చేసే సంస్థలో వాటర్ క్యాన్లను సరఫరా చేసే బాయ్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం అతను సీతంపేట సమీపంలో రైలు పట్టాలను దాటుతున్నాడు. ఈ క్రమంలో రత్నాచల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన

ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఓ వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చేవూరుకు చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన యువకుడు తంతేపూడి రాకేష్ నెల రోజుల నుంచి తన కోరిక తీర్చుమని వేధిస్తూ కనిపించినప్పుడల్లా అసభ్యకరమైన చేష్టలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని మహిళ తన భర్తకు, అత్తమామలకు చెప్పగా ఈ నెల 25వ తేదీ గురువారం రాకేష్ ఇంటికి వెళ్లి అడిగారు. దీంతో రాకేష్ అందరినీ బూతులు తిట్టి తనను, తన భర్తను కాళ్లతో తన్ని చేతులతో కొట్టాడని, అక్కడే ఉన్న బొడ్డు పృధ్విరాజ్ అనే వ్యక్తి తన అత్తమామలను చేతులతో కొట్టి, కాళ్లతో తన్నారని వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

దౌర్జన్యం చేసిన వారిపై కేసు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దౌర్జన్యం చేసిన వ్యక్తులపై ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరూరుకు చెందిన పుట్టి వీరనారాయణ, తోలేటి చుక్కమ్మ అన్నా చెల్లెలు. గతేడాది నవంబర్ 18వ తేదీన ఉదయం సుమారు తొమ్మిది గంటల సమయంలో తోలేటి చుక్కమ్మ, తోలేటి శ్రీనివాసరావు, సాయి, తోలేటి రేష్మ, తోలేటి పెంటయ్య, బొర్రా మాసియ్య, తొందూరు సుబ్బారావులు వీరనారాయణ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారు. తన భూమిలో కొంత భూమిని చుక్కమ్మకు ఇవ్వాలని తనను, తన భార్యను బూతులు తిట్టి, దౌర్జన్యం చేసి, భయభ్రాంతులకు గురిచేసి, వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, కిందపడవేసి కాళ్లతో తన్ని, చేతులతో కొట్టి చంపుతామని బెదిరించినట్లు వీరనారాయణ కోర్టు ద్వారా పంపిన ఎండార్స్‌మెంట్ రిపోర్టుపై హెచ్‌సి రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ పంచాయతీ

విద్యార్థుల హక్కులకు భంగం
పొలిటికల్ సైన్స్ సబ్జెక్టు కావాలని డిమాండ్
అమలు కాని డబుల్ మేజర్ సిస్టమ్
తీసుకురావాలన్న ఉన్నత విద్యా మండలి సిఫార్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సాధారణంగా పిల్లలు ఏ కోర్సు చదవాలనేదానిపై చిన్న వయసులో తల్లిదండ్రులు నిర్ణయం తీసుకుంటారు. అదే ఇంటర్, డిగ్రీకి వచ్చేసరికి తల్లిదండ్రులతో పాటు చదివే విద్యార్థులు కూడా నిర్ణయం తీసుకుంటారు. అదే తల్లిదండ్రులు అవగాహన, చదువు లేని వారయితే విద్యార్థులే ఏ సబ్జెక్టు చదవాలి, ఏ కోర్సు చదవాలనేదానిపై నిర్ణయం తీసుకుంటారు. కాని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుకు భిన్నంగా విద్యార్థులు ఏం చదవాలో కాలేజీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంటుంది. విద్యార్థులకు కావాల్సిన, ఆసక్తి ఉన్న సబ్జెక్టు చదవడానికి వీల్లేదని, తాము చెప్పిన సబ్జెక్టు మాత్రమే చదవాలని ప్రిన్సిపల్, అధ్యాపకులు హుకుం జారీ చేస్తున్నారు.

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత మూడేళ్లుగా బిఎ గ్రూపునకు హిస్టరీ మేజర్ సబ్జెక్టుగా ఉంది. మూడేళ్ల క్రితం వైసిపి హయాంలో సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం ఒక గ్రూపులో ఒక సబ్జెక్టు మాత్రమే మేజర్‌గా తీసుకుని మూడేళ్లువిద్యార్థి అదే సబ్జెక్టు చదవాల్సి ఉంటుంది. మైనర్‌గా మరో సబ్జెక్టు ఎంపిక చేసుకున్నప్పటికీ దానిలో పూర్తిస్థాయిలో బోధన ఉండదు. పరిచయం మాత్రమే ఉంటుంది. ఈ విధానంపై అనేక విమర్శలు వచ్చినా, ఈ విధానం సరికాదని మేధావులు, విద్యానిపుణులు హెచ్చరించినా వైసిపి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది. దీంతో ప్రస్తుతం అదేవిధంగా కొనసాగుతుంది. రెండు సబ్జెక్టులు ప్రధానంగా చదివేలా డబుల్ మేజర్ సిస్టం తీసుకురావాలని ఈ ఏడాది ఉన్నత విద్యామండలి సిఫార్సు చేసినప్పటికీ సింగిల్ మేజర్ విధానానికి ప్రభుత్వం మొగ్గు చూపి ఈ ఏడాది కూడా మొండిగా ముందుకెళ్లింది.

ముందు ఒక మాట.. తర్వాత మరో మాట

అయితే ఈ ఏడాది బిఎ గ్రూపులో చేరిన సుమారు 20 మంది విద్యార్థులు తమకు హిస్టరీ మేజర్ సబ్జెక్టుగా వద్దని, పొలిటికల్ సైన్స్ కావాలని అడుగు తున్నారు. అయితే అడ్మిషన్స్ టైమ్‌లో ఇక్కడ హిస్టరీ మాత్రమే మేజర్ సబ్జెక్టుగా ఉందని, ముందు అడ్మిషన్ తీసుకుంటే తర్వాత పొలిటికల్ సైన్స్‌కు మారవచ్చని అధ్యాపకులు చెప్పడంతో అడ్మిషన్ల గడువు ముగిసిపోతుందనే భయంతో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. ఇప్పుడు తమకు హిస్టరీ సబ్జెక్టు మేజర్‌గా వద్దని పొలిటికల్ సైన్స్ కావాలని అడుగుతుంటే అలా అవకాశం లేదని, గత మూడేళ్లుగా ఈ కాలేజీలో హిస్టరీ మాత్రమే మేజర్ సబ్జెక్టుగా ఉందని ప్రిన్సి పల్‌తో పాటు ఇతర అధ్యాపకులు చెప్పడంతో వి ద్యా ర్థులు ఏం చేయాలో తెలియని దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు.

అమలు కాని యుజిసి మార్గదర్శకాలు

యుజిసి మార్గదర్శకాల ప్రకారం డిగ్రీ కోర్సుల్లో విద్యార్థులు తమ ఆసక్తి ప్రకారం సబ్జెక్ట్ ఎంపిక చేసుకునే హక్కు కలిగి ఉంటారు. యాజమాన్యం బలవంతంగా వేరే సబ్జెక్ట్ చదవాలని చెప్పడం విద్యార్థుల హక్కులకు భంగం కలిగించడమే అవుతుంది. తమ కెరీర్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తమకు పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా కావాలని విద్యార్థులు అడుగుతున్నారు. ఈ విషయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేకసార్లు కాలేజీ వద్ద ఆందోళనలు నిర్వహించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో రాజధాని అమరావతి వెళ్లి అక్కడ హయర్ ఎడ్యుకేషన్ కమిషనర్‌ను, జాయింట్ డైరెక్టర్‌ను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

హయర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు వినతి (ఫైల్‌ఫొటో)

అడ్మిషన్ల సమయంలో బలవంతం

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు ఉన్నప్పటికీ ఆ ప్రయత్నం చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇతర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కూడా ఈ పరిస్థితి ఉంది. అధ్యాపకులకు తగినంత వర్క్ లోడ్ లేకపోతే వారికి బదిలీ తప్పదనే భయంతో కొంతమంది అధ్యాపకులు విద్యార్థులను బలవంతంగా వారి వారి సబ్జెక్టులు మేజర్‌గా తీసుకోవాలని అడ్మిషన్ల టైమ్‌లో బలవంతం చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రస్తుతం మొదటి విడతలో డిగ్రీ అడ్మిషన్లు పూర్తి కాగా ఈ నెల 25 గురువారం నుంచి రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ గ్రూపులో 16 మంది విద్యార్థులు తమకు పొలిటికల్ సైన్స్ మేజర్‌గా కావాలని అడుగుతున్నారు. రెండో విడత అడ్మిషన్లలో మరి కొంతమంది పెరిగే అవకాశం ఉంది. కచ్చితంగా పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. అడ్మిషన్లకు ముందే ఏయే కళాశాలల్లో ఏయే సబ్జెక్టులకు విద్యార్థులు ఎక్కువ వచ్చే అవకాశం ఉందో, ఏ సబ్జెక్టులకు డిమాండ్ ఉంటుందో ఆయా సబ్జెక్టులు మేజర్‌గా కావాలని కళాశాలలు ఉన్నతాధి కారుల నుంచి అనుమతి తీసుకునే అవకాశం ఉంది. కాని చాలా కళాశాలలు అలా చేయకుండా గత మూడేళ్లుగా ఏ సబ్జెక్టులు మేజర్‌గా ఉన్నాయో వాటినే విద్యార్థులపై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నాయి.

ప్రయివేట్ కళాశాలలకు వెళ్లలేని పేదలు

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు చాలా మంది పేద, బడుగు బలహీన తరగతుల నుంచి వచ్చే పరిస్థితి ఉన్న నేపథ్యంలో వారికి కావాల్సిన సబ్జెక్టు కోసం రూ.వేలు ఫీజులు కట్టి ప్రయివేట్ కళాశాలలకు వెళ్లలేని పరిస్థితి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా ఇవ్వాలని, ఈ విషయంపై కలెక్టర్ ను కూడా కలిశామని, అయినప్పటికీ ఎలాంటి ప్రయో జనం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు మేలు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాలి

ప్రిన్సిపల్ డాక్టర్ గిరిబాబు

ఈ విషయంపై ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబును వివరణ కోరగా గత మూడేళ్ల నుంచి ఇక్కడ ఏ సబ్జెక్టు మేజర్‌గా ఉందో అదే సబ్జెక్టు కొనసాగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఉన్నతాధికారులు అనుమతి ఇస్తే పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా ఇవ్వడానికి తమకు ఏమాత్రం అభ్యంతరం లేదని తెలిపారు. కళాశాలలో తగినన్ని మౌలిక వసతులు, తరగతి గదులు లేకపోయినప్పటికీ పొలిటికల్ సైన్స్‌కు అనుమతి ఇస్తే కచ్చితంగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

అందుబాటులోకి వైద్య పరికరాలు

సర్వజన ఆసుపత్రిలో రూ.కోటి విలువైన పరికరాలను ప్రారంభించిన ఎంపీ మహేష్
త్వరలో రెండు అధునాతన అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని హామీ

వైద్య పరికరాలు ప్రారంభిస్తున్న ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అరకొర సౌకర్యాలు, వైద్య పరికరాల కొరతతో ఇబ్బంది పడుతున్న ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కొంత స్వాంతన చేకూరింది. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద గెయిల్ ఇండియా ద్వారా రూ.కోటి విలువైన వైద్య పరికరాలు సమకూరాయి. వీటిని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ శుక్రవారం ప్రారంభించడంతో అత్యవసర వైద్య పరికరాలు రోగులకు అందుబాటులోకి వచ్చాయి. అనస్థీషియా వర్క్‌స్టేషన్లు రెండు, కార్డియోటోకోగ్రఫీ మెషిన్లు రెండు, కంప్యూటెడ్ రేడియోగ్రఫీ సిస్టం (ఎక్స్‌రే క్యాసెట్ రీడర్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్), ఆపరేషన్ థియేటర్ లైట్లు పది, ఐసిఇ లైన్డ్ రిఫ్రిజిరేటర్లు ఉన్నాయి. గత శుక్రవారం ఈ ఎక్విప్‌మెంట్ ఆసుపత్రికి చేరింది. వాటిని శుక్రవారం రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి రెండు అధునాతన అంబులెన్సులు కూడా త్వరలోనే అందిస్తామన్నారు. సిఎస్ఆర్ కింద ప్రభుత్వాసుపత్రికి రూ.కోటి విలువైన వైద్య పరికరాలు అందించడానికి కృషి చేసిన ఎంపీకి ఆసుపత్రి సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి ఏ సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చినా వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసే ఎంపీ ఉండటం ఏలూరు ప్రజల అదృష్టమన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), కలెక్టర్ వెట్రిసెల్వి, గెయిల్ ఇండియా జిఎం నారాయణ, హెల్త్ కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శరత్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

13 ఆర్‌ఒబిలకు అనుమతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఆర్‌బిలకు అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని, రైల్వే గేట్ల వద్ద ప్రజల కష్టాలకు తెరపడనుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. సమస్యల తక్షణ పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా 37 మందికి రూ.17.5 లక్షల విలువైన సిఎం ఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అనంతరం బాదంపూడి ఎస్‌సి కాలనీ గ్రామస్తులు ఎంపీని కలిసి ప్రతిపాదిత రైల్వే గేట్ ఆర్ఒబి వల్ల పేదల ఇళ్లు కోల్పోతున్న పరిస్థితిని ఎంపీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ రైల్వే అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలం తర్వాత రోడ్ల పనులపై దృష్టి సారిస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా 2027కి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారు.

ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

జయంతి వేడుకలో రజకచైతన్య సేవా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉద్యమమే ఊపిరిగా, పేదల అభ్యున్నతే ధ్యేయంగా వెట్టిచాకిరి పారద్రోలి భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన ధీశాలి చిట్యాల ఐలమ్మ ఆశయాలను రజకులు ముందుకు తీసుకెళ్లాలని రజకచైతన్య సేవా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గొల్లగూడెం గ్రామం రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఐలమ్మ 130వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఐలమ్మ ఆశయ సాధన కోసం రజకులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తణుకు పల్లపరావు మాట్లాడుతూ ఐలమ్మ ప్రజా పోరాటాలకు స్ఫూర్తి అని, బానిసత్వ సంకెళ్ల నుంచి శ్రామిక ప్రజలకు విముక్తి కలిగించిన వీర వనిత ఐలమ్మ అని ఆయన కొనియాడారు. రైతాంగ సాయుధ పోరాట యోధురాలు తన ఉద్యమం నేపథ్యంలో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ధీశాలి చిట్యాల ఐలమ్మ అని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండలాధ్యక్షులు పిప్పర ప్రసాద్, నల్లజర్ల మండలాధ్యక్షులు మడిచర్ల నాగేశ్వరరావు, బోగేల్లి రాంబాబు, అంజూరి శ్రీనివాసు, జొన్నాడ కొండయ్య, కడకట్ల శ్రీనివాస్, వెలుదూటి శ్రీనివాస్, పొలమూరు అన్నవరం, బుద్ధారపు పుల్లయ్య, జవ్వలపాలెం సత్యనారాయణ, కంచర్ల రామకృష్ణ, తణుకు సూర్యారావు, విప్పర నాగేశ్వరరావు, పల్లంట్ల రాంబాబు, దాచేపల్లి దుర్గారావు, దూసూరి సత్యనారాయణ, చిన్నారి శ్రీను, గుమ్మడి నరసింహమూర్తి, గ్రామ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి వేడుకలు

భీమడోలులో చిలకమర్తి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవితా పితామహులు, మహాకవి, రచయిత, తెలుగు నాటకకర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణవాది, విద్యావేత్త, కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం 158వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సహాయ గ్రంథ పాలకుడు విటి.సందీప్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యం అభివృద్ధికి తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుకొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరన్నారు. ఆయన 22 ఏళ్ల వయస్సులోనే రచించిన గయోపాఖ్యాన అనే నాటక ప్రతులు లక్షకు పైగా అమ్ముడుపోవడమనేది ఆంధ్రదేశంలోని అసంఖ్యాకమైన ప్రదర్శనలు పొందిందన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలోనే అరుదైన ఘనత కలిగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు : కలాన్ని ఆయుధంగా మలచిన సాహితీవేత్త చిలకమర్తి లక్ష్మీనరసింహం సాహిత్య రంగానికి చేసిన కృషి ఇప్పటికీ ఆదర్శప్రాయమని పలువురు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం 158వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వచ్ఛంద సంస్థ మానవత కెరియర్ గైడెన్స్ విభాగం జిల్లా డైరెక్టర్ టివి.ఉమామహేశ్వరరావు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై గ్రంథ పాలకులతో కలిసి చిలకమర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి విశేష సేవలందించిన చిలకమర్తి చిరస్మరణీయుడన్నారు. వితంతు పునర్వివాహం అణగారిన తరగతులకు పాఠశాలల ఏర్పాటు వంటి సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలులోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : మహాకవి, కళా ప్రపూర్ణ బిరుదాంకితులు విద్యావేత్త చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రచనల గురించి విద్యార్థులకు, గ్రంథాలయ పాఠకులకు శాఖా గ్రంథ్రాలయాధికారి జె.రమేష్‌బాబు వివరించారు.

ఆక్వా రైతులు అప్సడా పర్మిషన్ పొందాలి

ప్రజాశక్తి - కలిదిండి

ఆక్వా రైతులు తప్పనిసరిగా అప్సడా అనుమతులు పొందాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో మత్స్య శాఖాధికారులు ఏర్పాటు చేసిన ఆక్వా రైతుల అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ (అప్సడా) చట్టం 2020 ప్రకారం అనుమతి పొందితే కరెంట్ సబ్సిడీతో పాటు ప్రభుత్వం అందించే పథకాలు ఆక్వా రైతులు పొందవచ్చున్నారు. ఫిషరీస్ అసిస్టెంట్ రాంబాబు, డిసి ఛైర్మన్ నాగిడి వీరభద్రం, కార్యదర్శి గంగాశంకర్, తిరుమని పాండురంగారావు, డి.సత్యనారాయణ, ఈశ్వర పరశురాముడు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి రైతూ తమ పొలంలో పండించే పంట ఆరోగ్యకరంగా ఉండాలంటే సేంద్రియ, పకృతి వ్యవసాయం చేయాలని మండల వ్యవసాయాధికారి అక్కినేని చాముండేశ్వరి చెప్పారు. మండలంలోని చింతలవల్లి, ముసునూరు గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనం ఎన్నుకోవాలని చెప్పారు. అదే విధంగా ఆ విత్తనం దిగుబడి వ్యవసాయాధికారుల ద్వారా తెలుసుకోవాలని, విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. పంట దిగుబడి పెంచుకునేవిధంగా వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పకృతి, సేంద్రీయ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ నాయకులకు కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

అసెంబ్లీలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నాయకుల సామాజిక తరగతివారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అసెంబ్లీలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. గత ఏడు సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రాలు లేక విద్య, ఉద్యోగ, ప్రభుత్వ పథకాలకు అనర్హతకు గురైన దాదాపు 1500 మంది నాయకుల సామాజిక తరగతికి చెందిన వారికి అన్యాయం జరుగుతుందని వివరించారు. కామవరపుకోట మండలంలో 1500 పైగా నాయకుల సామాజిక తరగతి వారున్నారన్నారు. వారు ప్రభుత్వ పథకాలకు, విద్యకు, అన్నిటికి దూరమవుతున్నారన్నారు. వారిని ఆదుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీ వేదికగా పిటిషన్ అందించారు. సంబంధిత అధికారులు వారి జీవన శైలి, ఇతర అంశాలు పరిశీలించి వారికి త్వరలో ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం విడుదల చేయాలని కోరారు. అసెంబ్లీ వేదికగా ఎంఎల్ఎ రోషన్ కుమార్ తమ సమస్యను ప్రస్తావించడం తమకు చాలా అనందం కలిగించిందని, ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని, తమకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం వచ్చేలా చేయాలని కొమరం భీమ్ నాయకుల సంఘం నాయకులు అంకేం రాంబాబు, గోధుమ మధు, బింగి ఏసు, మీనుగుల నరసింహారావు, మొట్టు వీరభద్రరావు, గోధుమ నాగేశ్వరరావు, నల్లమోతుల మల్లేశ్వరరావు, రామారావు, తదితరులు ఆశాభావం వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

భీమడోలు : రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు సూపర్ జిఎస్‌టి, సూపర్ సిక్స్, పి-ఫోర్ కార్యక్రమాలు శక్తివంతమైన ఇంధనంగా పని చేస్తాయని, ముఖ్యమంత్రి పలు పథకాలను దీనికోసం అమలు చేస్తున్నారని, మండల స్థాయి అధికారులు. వీటిని విజయవంతం చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల స్థాయి అధికారులకు సూపర్ జిఎస్‌టి, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పేర సర్వే కార్యక్రమాన్ని అక్టోబర్ 19వ తేదీ వరకు మండల స్థాయి అధికారులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో హౌస్ హోల్డ్ స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించాలని కోరారు. దీంతో ప్రతి కుటుంబానికి రూ.15 వేల వరకు ఆదా, వ్యాపారుల అమ్మకాలు పెరిగే విధానాల గురించి తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు పెనుగొండ గ్రామ కాపురస్తురాలు వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ గారి భార్య: జలదాని శివ పార్వతి నాకు యిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ ది. 26-08-2023 సం॥ తేదిన పెనుగొండ వాస్తవ్యులు అయిన వడుగు పెదబాలయోగి గారి కుమారుడు వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ తో వివాహము శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, అన్నవరప్పాడు గ్రామంలో జరిగింది.

నా క్లయింట్ యొక్క ఆధార్ కార్డు లో ఆమె పుట్టింటి వారి ఇంటిపేరుతో జలదాని శివ పార్వతీ పేరుతో వున్న ఆధార్ కార్డు తన అత్తింటి వారి పేరు తో మార్పు చేసుకొనుటకు అనగా వడుగు శివ పార్వతి W/o. వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ గా మార్పు చేసుకొనుటకు దాఖలు చేసుకొనుటకు అవసరమై ఈ పేపరు ప్రకటన ఇవ్వడమైనది.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ పేరు **వడుగు శివ పార్వతి** W/o. వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ అని తెలియచేయడమైనది. కాబట్టి ఎవరికి అయినా అభ్యంతరములు ఉన్నా 7 రోజులలో తెలియ పర్చవలెను.

నా క్లయింట్ అడ్రస్సు:
వడుగు శివ పార్వతి
W/o. వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్,
డోర్ నెం. 14-75/6, JVI. నగర్, పెనుగొండ, ప॥గో॥జిల్లా.
Cell: 93903 89129

కంచెర్ల సురేష్‌బాబు
అడ్వకేట్, గూడెం రోడ్
సెల్: 94401 11308

మార్టేరు
ది.26-09-2025

మహారాజశ్రీ మొదటి అధనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు. ఏలూరు జిల్లా

FDIA No. 45/2024 in O.S.No. 145/2020

బిట్వీన్:
వన్నెకూటి లక్ష్మీ ప్రసన్న ...Petitioner/Plaintiff
Vs
పరిసే మాధవి మరియు 3 వగైర ...Respondents/Defendants

R1. పరిసే మాధవి,
W/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు విలేజ్, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
R2. పరిసే సన్నీ,
S/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు విలేజ్, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
R3. పరిసే రత్నకుమార్,
S/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు గ్రామము, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
R4. పరిసే షేని,
D/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు గ్రామము, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
4th Respondent, Being Minor Rep by its Natural Guardion: Mother ie 1st Respondent here in

కోర్టు ప్రకటన

పై నెంబరు దావాలోని వాది పెలిమినరి డిక్రీ పొందియున్నాడు. అందునిమిత్తం వాది ఫైనల్ డిక్రీ పిటీషన్ ఫైల్ చేసియున్నారు. పై నెంబరు FDIA 45/2024 లో Respondents ఎన్ని సార్లు కోర్టు మీకు నోటీసులు పంపినను నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. పై నెంబరు FDIA లో ప్రతివాదులకు నెం. 1 to 4 ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల **ది. 14-10-2025 వ తేదీ ఉదయం గం. 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆక్షేపణలు తెలియజేసుకోనవలెను. లేనియెడల మీకు పరోక్షముగా అర్డరు పాస్ చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడం అయినది.

K.R.K. Chowdary
Advocate
Eluru

Eluru
Date: 26-09-2025

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ అయిన **సానబోయిన శశికిరణ్** తండ్రి రామారావు,24-30, చిట్టూరి వారి వీధి, చేరుకువాడ,పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534320, వీరికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యూమెంట్ డాక్యూమెంట్ నెం.1314/2003 తేదీ 24-06-2003 S.R.O పెనుగొండ ఆర్ఎస్ నెం 125/4 extent 170 చదరపు గజములు పెనుగొండ మండలం చెరుకువాడ గ్రామంలో ఉంది. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజులను ది. 09-09-2025 తేదీన పెనుగొండ నుండి పాలకొల్లు బస్సులో వెళు చుండగా పడిపోయినది మరల వెళ్లి అంతయు వెతికిన దొరకలేదు ఎవరికైనా దొరికిన యెడల మాకు అందజేయగలరు

బండి లీలా ఫణి శ్రీరామ్
అడ్వకేట్-భీమవరం సెల్ :7893944559